RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ సంపుటి: 4 సంచిక:125 | శుక్రవారం మే 08, 2026 | పేజీలు 8 వెల: రూ.3-00 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260



## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

మూడు రోజుల పాటు వానలు కురిసే అవకాశం

ద్రోణి ప్రభావంతో తగ్గనున్న ఉష్ణోగ్రతలు

2లో



# పొలిటికల్ హీట్!

## మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ అలర్ట్

### నెక్ట్స్ తెలంగాణే అంటూ ఢిల్లీ కాషాయ పెద్దల సంకేతాలు

- రాష్ట్రంలో బెంగాల్ వ్యూహం అమలు
- ఈనెల 10న మోడీ పర్యటన ఖరారు
- లోకల్ నాయకత్వ మార్పు తప్పదా?
- అప్రమత్తమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పదవుల భర్తీ
- దూకుడు పెంచనున్న బీఆర్ఎస్
- కారు పార్టీలో పెరిగిన నాయకత్వ కొరత
- కేటీఆర్ హరీష్ పైనే భారీ భారం

2లో

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని ఒక్కసారిగా మార్చివేసింది. ఉత్తరాదిలో వీచిన కాషాయ గాలి ఇప్పుడు దక్కన్ పీఠభూమిని తాకుతుండటంతో.. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలు ఉలిక్కిపడ్డాయి. పశ్చిమ బెంగాల్ తరహా వ్యూహంతో తెలంగాణ గడ్డపై పాగా వేయాలని మోడీ-షా ద్వయం పక్కా స్కెచ్‌తో దూసుకొస్తుంటే, తమ కోటను కాపాడుకునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్, ఉనికిని చాటుకునేందుకు గులాబీ దళం వ్యూహప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. ప్రధాని మోడీ పర్యటన ముంగిట రాష్ట్రంలోని మూడు ప్రధాన పక్షాల మధ్య మొదలైన ఈ పొలిటికల్ హీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను రేపుతోంది.



# కరీంనగరం.. రణరంగం

- ఎమ్మెల్యే గంగుల క్యాంపు కార్యాలయంపై బీజేపీ నేతల దాడి
- కౌశిక్ రెడ్డి ఉన్నాడనే సమాచారం దూసుకొచ్చిన నేతలు
- కౌశిక్ రెడ్డిని సురక్షిత ప్రాంతానికి తరలించిన పోలీసులు
- కార్యాలయంపై రాళ్ల వర్షం..
- కారు అద్దాలు పగలగొట్టి, ఫర్నీచర్ ధ్వంసం
- డ్రగ్స్ సవాళ్లతో భగ్గుమన్న రాజకీయం



**వేద న్యూస్, కరీంనగర్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయం గురువారం రణరంగాన్ని తలపించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై బీజేపీ నేతలు, కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరులు దాడికి యత్నించారు. గురువారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమాలాకర్ క్యాంపు ఆఫీసులో కౌశిక్ రెడ్డి ఉన్నట్లుగా సమాచారం అందుకున్న బీజేపీ నేతలు.. ఆయనపై దాడికి యత్నించారు. ఈసందర్భంగా బీజేపీ నేతలు క్యాంపు ఆఫీసులోని సామగ్రిని, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులు హుటాహుటినా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అక్కడి నుంచి తరలించారు. కౌశిక్ రెడ్డి, బండి సంజయ్ మధ్య

మిగతా 2వ పేజీలో



## తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ

మెజారిటీ కోసం చిన్న పార్టీలతో టీవీకే చర్చలు

2లో

### ఫార్మా సిటీ రైతుల పక్షాన

# పోరాడుతాం

### భూసేకరణ వెంటనే నిలిపివేయాలి

- రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తాం
- బషీర్‌బాగ్ అఖిలపక్ష సమావేశంలో కల్వకుంట్ల కవిత హెచ్చరిక

2లో



### రైతులను తరుగు పేరుతో

# దోచుకుంటున్నారు

- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం
- యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్
- చౌటుప్పల్ మార్కెట్‌లో రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు విమర్శలు



**వేద న్యూస్, యాదాద్రి భువనగిరి**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెలు ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

శుక్రవారం మే 08, 2026

# కరీంనగరం.. రణరంగం

**మొదటి పేజీ తరువాయి**

'డ్రగ్స్ టెస్ట్' సవాల్.. చివరకు భౌతిక దాడులకు దారితీసింది. డ్రగ్స్ టెస్ట్ సవాల్.. తంబాకు కౌంటర్‌తో సెగలు ఈ వివాదానికి ప్రధాన కారణం. గత రెండు రోజులుగా సాగుతున్న మాటల యుద్ధం. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటున్నారని, దమ్ముంటే టెస్టుకు రావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. దీనికి కౌంటర్ ఇస్తూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'బండి సంజయ్ తంబాకులో డ్రగ్స్ కలుపుకొని తీసుకుంటున్నాడు.. ముందు ఆయన టెస్టుకు రావాలి' అంటూ ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలతో తీవ్ర ఆగ్రహానికి లోనైన బీజేపీ శ్రేణులు, కౌశిక్ రెడ్డి కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉన్నారనే పక్కా సమాచారంతో భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

### గన్‌మెన్ల అప్రమత్తత

కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ కార్యకర్తలు 'గో బ్యాక్ కౌశిక్ రెడ్డి' అంటూ నినాదాలు చేస్తూ ఒక్కసారిగా గేట్లు తోసుకుని లోపలికి చొచ్చుకెళ్లారు. ఆవరణలో ఉన్న ఎమ్మెల్యే కాన్వాయ్‌పై రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో కౌశిక్ రెడ్డి వాహనం అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. కార్యాలయంలోని అద్దాలను, కుర్చీలను ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టించారు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో కౌశిక్ రెడ్డి వ్యక్తిగత గన్‌మెన్లు అప్రమత్తమై ఆందోళనకారులను లోపలికి రాకుండా అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే కరీంనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులను చెల్లాచెదురు చేసి, ఎమ్మెల్యేను సురక్షితంగా వెనక్కి పంపించివేశారు.

### దమ్ముంటే చర్చకు రండి..

ఈ ఘటనపై బీజేపీ నేతలు స్పందిస్తూ.. కేంద్ర మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. చర్చలకు భయపడే కౌశిక్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మరోవైపు, బీఆర్ఎస్ శ్రేణులు ఈ దాడిని తీవ్రంగా ఖండించాయి. ఓటమి భయంతో, ప్రశ్నించే గొంతును నొక్కేందుకే బీజేపీ ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదని, పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కరీంనగర్ నగరంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### బీజేపీ కార్యాలయం ముట్టడికి బీఆర్ఎస్ యత్నం

కరీంనగర్‌లో రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై దాడి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడి యత్నానికి నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు గురువారం బీజేపీ జిల్లా కార్యాలయం ముట్టడికి ప్రయత్నించాయి. దీంతో నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వందలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు 'బండి సంజయ్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేస్తూ బీజేపీ కార్యాలయం వైపు దూసుకెళ్లారు. బారికేడ్లు దాటేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులకు దిగినట్లు సమాచారం. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు పలు ప్రాంతాల్లో లాఠీచార్జ్ నిర్వహించి కార్యకర్తలను చెదరగొట్టారు. పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఉద్రిక్తతల నేపథ్యంలో నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సీపీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో అదనపు భద్రతా చర్యలు చేపట్టగా, పలు వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం చివరకు కరీంనగర్‌లో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం నగరంలో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

# తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ


**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

> మెజారిటీ కోసం చిన్న పార్టీలతో టీవీకే చర్చలు

తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 108 స్థానాలు గెలుచుకుని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన పూర్తి మెజారిటీ మాత్రం ఇంకా దక్కలేదు. ఐదుగురు సభ్యులున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే టీవీకే అధినేత విజయ్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకే బలం 113కు చేరింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల సంఖ్యకు ఇంకా ఐదుగురు సభ్యుల మద్దతు అవసరమవుతోంది. ఈ నేపథ్యంలో టీవీకే పలు చిన్న పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీటీవీ దినకరన్ నేతృత్వంలోని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం తరఫున గెలిచిన ఎమ్మెల్యే ఎస్ కామరాజ్ మద్దతును టీవీకే కోరినట్లు జాతీయ మాధ్యమాల్లో కథనాలు వెలువడ్డాయి. మరోవైపు టీవీకేకు ఎట్టి పరిస్థితుల్లో మద్దతు ఇవ్వబోమని అన్నాడీఎంకే స్పష్టం చేసింది. డీఎంకే ప్రతిపక్షంలోనే కూర్చుంటామని ప్రకటించింది. అయితే తమ కూటమిలోని చిన్న పార్టీలకు మాత్రం స్వేచ్ఛ ఇచ్చినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు స్థానాలు గెలుచుకోగా, పీఎంకే నాలుగు స్థానాలు సాధించింది. ఐయూఎంఎల్, సీపీఐ, వీసీకే, సీపీఐ(ఎం) పార్టీలు రెండేసి స్థానాలు దక్కించుకున్నాయి. బీజేపీ, డీఎండీకే, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ఒక్కో స్థానంలో విజయం సాధించాయి. పీఎంకే, వీసీకే, వామపక్ష పార్టీలు విజయ్‌కు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై రేపు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ నిర్ణయాలు తమిళనాడు రాజకీయ సమీకరణాల్లో కీలకంగా మారే అవకాశముంది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. టీవీకేకు మరిన్ని పార్టీలు మద్దతు ప్రకటిస్తాయా లేదా అన్న అంశంపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# పొలిటికల్ హీట్!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**



> **మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ అలర్ట్**
> - నెక్స్ట్ తెలంగాణే అంటూ ఢిల్లీ కాషాయ పెద్దల సంకేతాలు
> - రాష్ట్రంలో కమలం పార్టీ బెంగాల్ వ్యూహం అమలు
> - ఈనెల 10న మోడీ పర్యటన
> - లోకల్ నాయకత్వ మార్పు తప్పదా?
> - అప్రమత్తమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
> - కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పదవుల భర్తీ
> - దూకుడు పెంచనున్న బీఆర్ఎస్
> - కారు పార్టీలో పెరిగిన నాయకత్వ కొరత
> - కేటీఆర్ హరీష్ పైనే భారీ భారం

దేశంలోని ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, ముఖ్యంగా మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ క్లీన్ స్వీప్ చేయడంతో తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఉత్తరాది గాలి దక్షిణాదికి, అందునా తెలంగాణకు బలంగా తాకబోతోందన్న సంకేతాలు స్పష్టమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు తమ భవిష్యత్తు కార్యాచరణను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసుకుంటున్నాయి. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ కాషాయ జెండాను ఎగరవేయడం కేవలం ఆ రాష్ట్రాల విజయంగానే కాకుండా, తెలంగాణపై పట్టు సాధించేందుకు ఒక ఊతంగా మారింది. ఈ ఫలితాల తర్వాత రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో మునుపెన్నడూ లేని ఉత్సాహం కనిపిస్తోంది. దీంతో.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కసారిగా అలర్ట్ అయ్యాయి. వచ్చే ఎన్నికలకు బీజేపీ సిద్ధమవుతుండడంతో తమ వ్యూహాలను పదును పెడుతున్నాయి.

### బెంగాల్ స్ట్రాటజీ

గత 15 ఏళ్లుగా పశ్చిమ బెంగాల్‌లో పట్టు సాధించాలని చూసిన బీజేపీ, ఇటీవలి కాలంలో అక్కడ సాధించిన ఫలితాలు దేశాన్ని ఆకర్షించాయి. ఇప్పుడు అదే పశ్చిమ బెంగాల్ వ్యూహాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని మోడీ-షా ద్వయం భావిస్తోంది. బెంగాల్‌లో ఎలాగైతే అధికార పార్టీని ఢీకొట్టడానికి స్థానిక బూత్ స్థాయి వ్యవస్థను బలోపేతం చేశారో, తెలంగాణలోనూ అదే పద్ధతిని అనుసరిస్తున్నారు. దూకుడుగా ఉండే నాయకులను గుర్తించి, క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని బలాన్ని కల్పించడం ఈ వ్యూహం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 10న తెలంగాణలో పర్యటించబోతున్నారు. ఈ పర్యటనను బీజేపీ శ్రేణులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ పర్యటన ద్వారా పార్టీ క్యాడర్‌లో కొత్త జోష్ నింపాలని అధిష్టానం యోచిస్తోంది.

### లోకల్ లీడర్‌షిప్‌పై బీజేపీ అధిష్టానం కన్ను..

తెలంగాణలో ఉన్న బీజేపీ లోకల్ నాయకత్వాన్ని ప్రక్షాళన చేయడమే కాకుండా, దూకుడుగా ఉండే నేతలకు కీలక బాధ్యతలు అప్పగించాలని అధిష్టానం నిర్ణయించింది. కేవలం మాటలకే పరిమితం కాకుండా, రోడ్లపైకి వచ్చి పోరాడే నాయకులను గుర్తించి ఒక ప్రత్యేక టీమ్ను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టేలా, మీడియాలో, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే నేతలకు ఈ టీమ్‌లో ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ దూకుడు రాజకీయాలతో ప్రజల దృష్టిని ఆకర్షించాలనేది బీజేపీ ప్లాన్.

### రేవంత్ సర్కార్ అలెర్ట్..

బీజేపీ దూకుడును గమనిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్కసారిగా అప్రమత్తమైంది. తెలంగాణలో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి సమర్థవంతంగా వెళ్లేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా బీజేపీ మతం లేదా జాతీయవాదం కార్డు ప్లే చేయకుండా, తన పాలనలోని అభివృద్ధి అజెండాను ప్రజల ముందు ఉంచాలని ఆయన వ్యూహాలు రచిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతం కావడం అనేది జాతీయ రాజకీయాల్లోనూ కీలకమైన అంశం. రాహుల్ గాంధీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాలనే లక్ష్యంతో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం, అందుకు అవసరమైన ఎంపీ సీట్లను తెలంగాణ నుంచే అందించాలని కృతనిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలోనే సంస్థాగత పదవుల భర్తీని వేగవంతం చేశారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను పునర్నిర్మించి, ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### బీఆర్ఎస్‌లో నాయకత్వ లేమి పై చర్చ..

మరోవైపు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో ఇప్పుడు నాయకత్వ లోపంపై చర్చ జరుగుతోంది. ఉద్యమ కాలం నుంచి పార్టీని నడిపించిన కేసీఆర్, ప్రస్తుతం వయసు రీత్యా, ఆరోగ్య కారణాల రీత్యా అన్ని ప్రాంతాల్లో పర్యటించలేని పరిస్థితి నెలకొంది. కేసీఆర్ యాక్టివ్‌గా ఉంటేనే కేడర్‌లో ఉత్సాహం ఉంటుందని భావించే కార్యకర్తలు, ఇప్పుడు ఆయన తక్కువగా కనిపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. పార్టీలో కేసీఆర్ తర్వాత అంతటి ప్రభావం చూపగల నేతల కోసం కేడర్ వెతుకుతోంది. కేసీఆర్ పర్యటనలు తగ్గడంతో పార్టీ మొత్తం భారం ఇప్పుడు కేటీఆర్, హరీష్ రావుల భుజాలపై పడింది. ఈ ఇద్దరు నేతలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ పార్టీని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, మాజీ మంత్రులు మరియు ఇతర కీలక నేతలు గతంలో లాగా చురుగ్గా పాల్గొనడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు కోల్పోకుండా ఉండాలంటే కేవలం ఇద్దరు నేతలు మాత్రమే కాకుండా, అందరూ కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నీ స్థాయి ఎంత.. నీ బతుకెంత?

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

> బిడ్డా కేటీఆర్.. వరంగల్ దాటలేవు
> రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తావా?
> వరంగల్ డీసీసీ ప్రెసిడెంట్ అయూబ్



కేటీఆర్.. నీ స్థాయి ఎంత, నీ బతుకెంత.. నువ్వా రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని విమర్శించేది అని వరంగల్ డీసీసీ ప్రెసిడెంట్ అయూబ్ కేటీఆర్‌పై మండి పడ్డారు. రైతు సంగ్రామ సభలో కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలపై మాట్లాడిన మాటలకు స్పందిస్తూ అయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేటీఆర్ పై మండిపడ్డారు.వందేళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీపై మాట్లాడే అర్హత నీకు ఎక్కడిది కేటీఆర్ అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని హౌలే గాడు అంటూ మాట్లాడడం చూస్తుంటే కేటీఆర్ కి మతిస్థిమితం సరిగ్గా లేనట్టు అనిపిస్తుందని అన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకొని మాట్లాడుతున్నారని ఆరోపించారు. అసలు కేటీఆర్ కు రైతు సభ పెట్టే హక్కే లేదని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి చేస్తానని చెప్పారు. కేజీ టు పీజీ విద్య ఉచితమని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏ హామీ నెరవేర్చారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు బేడీలు వేసిన నీచమైన చరిత్ర మీదే అని ధ్వజమెత్తారు. 2014 నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్రంలో 641 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మరోసారి మా నాయకులు రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిలపై పిచ్చి పిచ్చి కూతలు కూస్తే చూస్తూ ఊరుకోమని ఈసారి వరంగల్ కి వస్తే తిరిగి వెళ్లలేవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట అధ్యక్షులు ఎద్దు సత్యం, తూల రవి,గీసుకొండ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, దాడి శివ, సంఘ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, ఇండ్ల రవి, ఈగ దామోదర్, నాంపల్లి యాదగిరి, జన్ను అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను తరుగు పేరుతో దోచుకుంటున్నారు

**మొదటి పేజీ తరువాయి**

లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారని, కానీ వాస్తవ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని హరీశ్ రావు అన్నారు. తాను ఏసీ గదుల్లో కూర్చొని మాట్లాడడం లేదని, రైతుల మధ్య నిలబడి వారి గోడును వింటున్నానని వ్యాఖ్యానించారు. తేమ పరీక్షకు పది రోజులు, గోనె సంచుల కోసం మరో వారం, తూకం వేయడానికి మరో వారం పడుతోందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీల వద్ద బస్తాలకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

# ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడుతాం

**వేద న్యూస్, హైదరాబాద్**

> **భూసేకరణ వెంటనే నిలిపివేయాలి**
> - రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తాం
> - బషీర్‌బాగ్ అఖిలపక్ష సమావేశంలో కల్వకుంట్ల కవిత హెచ్చరిక



ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో "ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది" అంశంపై నిర్వహించిన అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఫార్మా సిటీ భూసేకరణ కోసం తీసుకొచ్చిన జీవో 31ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అంగీకారం లేకుండానే భూములు సేకరించారని ఆరోపించారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేర్లతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఫార్మా సిటీ విషయంలో అసత్యాలు చెప్పిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. కోర్టులో ఒక విధంగా, ప్రజల ముందు మరో విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ రక్షణ సేన ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కవిత మండిపడ్డారు. బుల్లెట్ ట్రైన్, డేటా సెంటర్లు, భారీ పెట్టుబడుల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. డేటా సెంటర్ల వల్ల కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎకరాకు ఇచ్చే పరిహారం రైతుల భవిష్యత్తుకు సరిపోదని కవిత అన్నారు. రైతుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి పేరుతో గ్రామీణ ప్రాంతాలను నష్టపరిచే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల పంట కొనుగోళ్ల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని కవిత ఆరోపించారు. భవిష్యత్తులో పంట కొనుగోళ్లు ఎత్తివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ వాతావరణ మార్పుల ప్రభావంతో గత కొన్ని రోజులుగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణలో జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. చెట్ల కింద నిలబడకుండా, అవసరం లేకుండా బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని తెలిపింది. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కోతకు వచ్చిన పంటలను భద్రపరుచుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది.

# మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం

**– మానవత్వం చాటుకున్న గ్రామ పెద్దలు, యువత**



**వేద న్యూస్, కోటగిరి:**

కోటగిరి మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లికి చెందిన నల్ల సాయిలు (బంక్ సాయిలు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి గ్రామ పెద్దలు, మిత్రబృందం, బ్రాహ్మణ గల్లీ యువత కలిసి రూ.68,850 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజు మహారాజ్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, తెల్ల రవికుమార్, కప్ప సంతోష్, కోయిగూర్ శ్రీనివాస్, కమ్మరి గగన్, వడ్ల రాజు, నాగభూషణం, అరుణ్ గౌడ్, యోగేష్, నరేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ

**నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి : బత్తిని సంపత్**

**వేద న్యూస్, చొప్పదండి :**



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అనుచరులు గుండాల్లా వ్యవహరిస్తూ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంటిపై, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని చొప్పదండి పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు బత్తిని సంపత్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుల సమక్షంలోనే దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులకు భయపడబోమని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రైతాంగానికి నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం

**– సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలోకి అధికారులు**
**– విద్యుత్ శాఖ ఏఈ వెంకన్న**

**వేద న్యూస్, కారేపల్లి :**



రైతాంగానికి నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కారేపల్లి విద్యుత్ శాఖ ఏఈ వెంకన్న తెలిపారు. గురువారం రొట్టమాకురేవు రైతు వేదికలో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ప్రక్రియను వేగవంతం చేశామని, ట్రాన్స్‌ఫార్మర్ల రవాణా ఖర్చులను కూడా శాఖే భరిస్తోందని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గించేందుకు కవర్డ్ కండక్టర్లు, ప్రత్యామ్నాయ సరఫరా కోసం ఇంటర్‌లింకింగ్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సమస్యలు ఎదురైతే 1912 టోల్ ఫ్రీ నంబర్ లేదా విద్యుత్ ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు మోతి వీరస్వామి, మత్రు నాయక్, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, వ్యవసాయాధికారి భట్టు అశోక్ కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# మోడీ సభను విజయవంతం చేయాలి

**– ప్రతి బూత్ నుంచి భారీగా తరలిరావాలి**
**– బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు నిరంజన్**



**వేద న్యూస్, పరకాల ప్రతినిధి :**

10న హైదరాబాద్‌లో జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ పిలుపునిచ్చారు. గురువారం పరకాల పట్టణ విలీన గ్రామాలైన రాజిపేట, సీతారాంపురంలో గుడిగంటి రఘుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ శక్తి కేంద్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్ నుంచి యువకులు, మహిళలు భారీ సంఖ్యలో సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణచారి, ఆకుల లావణ్య శ్రీధర్, పట్టణ కార్యదర్శి సంఘ పురుషోత్తం, మెంతుల సురేష్, ఉడుత చిరంజీవి, తడక విక్రం తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానవాటికకు దారి చూపిన సర్పంచ్

**– ముళ్లపొదలు తొలగించి శుభ్రపరిచిన వైకుంఠధామం**
**– గ్రామస్తుల కష్టాలకు చెక్ పెట్టిన రంజిత్ కుమార్**



**వేద న్యూస్, కారేపల్లి :**

గాదెపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్మశాన వాటిక దుస్థితిని గమనించిన సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ వెంటనే స్పందించి శుభ్రపరిచే పనులు చేపట్టారు. కొంతకాలంగా శ్మశాన వాటికలో భారీ చెట్లు, ముళ్లపొదలు పెరిగిపోవడంతో పాటు అక్కడికి వెళ్లే దారి కూడా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ సొంత పర్యవేక్షణలో జేసీబీ సహాయంతో చెట్లు, ముళ్లపొదలను తొలగించి స్మశాన వాటికను పూర్తిగా శుభ్రం చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన అంతిమ సంస్కారం జరిగేలా చూడటం తన బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. మా కష్టాలను గుర్తించి చివరి ప్రయాణాన్ని సులభతరం చేశారు అంటూ గ్రామస్తులు సర్పంచ్ సేవలను అభినందించారు.

# చిన్న కుటుంబానికి పెద్ద కష్టం

- ☐ క్యాన్సర్‌తో పోరాడుతున్న మహిళ
- ☐ మౌనిక చికిత్సకు దాతల సహాయం కోరుతున్న భర్త
- ☐ భార్య అనారోగ్యం, ఆర్థిక భారంతో మనోవేదన
- ☐ మానవత్వంతో ముందుకు రావాలని వేడుకోలు





**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్‌కు చెందిన మధుసూదన్, మౌనిక దంపతులు ఇద్దరు చిన్నారులతో సాధారణ జీవితం గడుపుతున్నారు. ప్రైవేట్ ఉద్యోగాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న సమయంలో మౌనిక (32)కు క్యాన్సర్ సోకడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రస్తుతం మౌనిక హైదరాబాద్‌లోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. క్యాన్సర్ మూడో దశలో ఉండటంతో చికిత్సకు లక్షల్లో ఖర్చు అవుతోంది. ఇద్దరు పిల్లల పోషణతో పాటు వైద్య ఖర్చులు భరించడం కుటుంబానికి భారంగా మారింది. ఆర్థిక పరిస్థితి దెబ్బతినడంతో మధుసూదన్ దాతల సహాయం కోరుతున్నారు. చిన్న సహాయం తమ కుటుంబానికి అండగా నిలుస్తుందని వేడుకుంటున్నారు. సహాయం చేయాలనుకునే వారు మధుసూదన్ ఫోన్ నంబర్ 9398711733 కు ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి

**– మన్యం వీరుడికి నివాళులర్పించిన మాజీ ఆర్మీ జవాన్ దంపతులు**

**వేద న్యూస్, మందమర్రి :**



మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతిని గురువారం మందమర్రిలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ పీవ్ హాల్, రాణి పీవ్ హాల్ దంపతులు తమ నివాసంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను సంఘటితం చేసి అల్లూరి సీతారామరాజు గెరిల్లా పోరాటం సాగించారని గుర్తుచేశారు. గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పెందోట వెంకట నరసయ్య పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామ చెరువు వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు గ్రామ సర్పంచ్ కుర్లెపు గంగాధర్ గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలకు ఉపశమనం కలిగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రేపల్లి సాయి ప్రసాద్, గ్రామస్తులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

# అయ్యో.. రైతన్న

## అన్నదాతకు ఎంత కష్టం.. ఎంత నష్టం

- అకాల వర్షంతో చేతికొచ్చిన పంట నీటిపాలు
- ఈదురుగాలులకు కూలిన వరి, మొక్కజొన్న పంటలు
- కళ్లముందే తడిసిన ధాన్యంతో ఆవేదన
- పంట నష్టంతో ఆర్థికంగా కుదేలైన కర్షకులు





**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన అకాల వర్షం కురవడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. రైతు మార్కెట్లలో నిల్వ ఉంచిన ధాన్యం తడవడంతో పాటు పంటలు నేలకూలిపోయాయి. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలు కళ్లముందే దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని కాపాడేందుకు తార్పాలిన్ కవర్లు వేసినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు ఉన్నప్పటికీ తీవ్ర ఎండల తర్వాత ఒక్కసారిగా కురిసిన వర్షం రైతుల కుటుంబాల్లో విషాదం నింపింది. ఇప్పటికే భారీ పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# సాగునీటిని ఆదా చేద్దాం..

- భావితరాలకు నీటిని అందిద్దాం
- రైతులకు శాస్త్రీయ సాగుపై అవగాహన
- నీటి పొదుపు పద్ధతులు వివరించిన శాస్త్రవేత్తలు




**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని శాయంపేట, నేరెడుపల్లి గ్రామాల్లో వ్యవసాయ కళాశాల వరంగల్ ఆధ్వర్యంలో, జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాలు నిర్వహించి రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించారు. శాయంపేట గ్రామంలో 'సాగునీటిని ఆదా చేద్దాం - భావితరాలకు నీటిని అందిద్దాం' అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బి. విద్యాసాగర్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరాన్ని వివరించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులు, వర్షపు నీటి సంరక్షణ, చెక్‌డ్యామ్‌లు, ఫార్మ్‌పాండ్‌ల ప్రాముఖ్యతను తెలియజేశారు. డాక్టర్ సిద్ధార్థ నాయక్ మాట్లాడుతూ.. పంట దశలకు అనుగుణంగా నీటి యాజమాన్యం పాటించడం ద్వారా నీటి వృథాను తగ్గించవచ్చన్నారు. మల్చింగ్, సేంద్రియ పదార్థాల వినియోగంతో నేలలో తేమ నిల్వ ఉండి నీటి అవసరం తగ్గుతుందని వివరించారు. అనంతరం నేరెడుపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ టి. శ్రీజయ రైతులకు పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలపడం, సేంద్రియ ఎరువుల వినియోగం, పంట మార్పిడి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ సహా ఉపాధ్యాయులు డాక్టర్ ఎస్. వంశీకృష్ణ ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు, సస్యరక్షణ పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారులు, సర్పంచులు, ఎన్‌జీఓ ప్రతినిధులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# 72 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

- అక్రమ పట్టాలు రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- నకిలీ రిజిస్ట్రేషన్లపై క్రిమినల్ కేసుల హెచ్చరిక



**వేద న్యూస్, పెద్దపల్లి:**

ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలు, నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేసిన వారు స్వచ్ఛందంగా భూములను అప్పగించాలని, లేకపోతే పట్టాలు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు. ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి శివారులోని సర్వే నెం.679లో గల 72.03 ఎకరాల ప్రభుత్వ పరంపోగు భూమిని జిల్లా యంత్రాంగం తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. తాత్కాలిక సాగు అనుమతులను ఆసరాగా చేసుకుని అక్రమంగా పట్టా మార్పిడులు, రిజిస్ట్రేషన్లు జరిగినట్లు విచారణలో తేలిందన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ మంత్రి ఆదేశాలతో పెద్దపల్లి ఆర్డీవో సమర్పించిన నివేదిక ఆధారంగా భూమిని ప్రభుత్వ ఖాతాలోకి బదిలీ చేసినట్లు వెల్లడించారు. 1347 ఫసలీ కాలం నాటి తాత్కాలిక అనుమతులను ఆధారంగా చేసుకుని 11 మందికి చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించి, నోటీసులు జారీ అనంతరం పట్టాలను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విచారణలో పెద్దపల్లి ఆర్డీవో, ధర్మారం తహసీల్దార్ తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మృత్యువులోనూ వీడని బంధం..ఈతకు వెళ్లి ముగ్గురు స్నేహితులు మృతి

**వేద న్యూస్ వర్గల్ :**

సిద్దిపేట జిల్లాలో విషాదంలో చోటు చేసుకుంది. హల్దీ వాగులో ఈతకోసం వెళ్లి వర్గల్ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు మృతి చెందారు. నర్సాపూర్ కు చెందిన ప్రశాంత్ యాదవ్(27) వికాస్(27 ఆనంద్ రెడ్డి(27) తూప్రాన్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం ఈతకోసం ముగ్గురు కలిసి హల్దీ వాగులో దిగారు.ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ముగ్గురు మృతి చెందారు. గమనించిన స్థానికులు మృదేహాలను వెలికితీశారు. ముగ్గురు స్నేహితుల మృతితో నర్సాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# రుద్రూర్‌లో గ్రామసభ నిర్వహణ

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలపై చర్చ



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై చర్చించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా గ్రామ పెద్దల సమక్షంలో నిజమైన నిరుపేదలను గుర్తించి పంపిణీ చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రశాంత్ గౌడ్, గ్రామ పెద్దలు, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చెలరేగిన మంటలు..

- దగ్ధమైన మొక్కజొన్న పంటలు
- బుచ్చిరెడ్డిపల్లిలో రైతులకు భారీ నష్టం



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లి గ్రామ శివారులో గురువారం మధ్యాహ్నం చెలరేగిన మంటలు సుమారు 8 నుంచి 10 ఎకరాల మేర మొక్కజొన్న పంటను దగ్ధం చేశాయి. కోత దశలో ఉన్న పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. మొక్కజొన్న కుప్పల సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు గాలికి ఊగి షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు దుండగుల ప్రమేయం కూడా ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో భూక్య మైబు 3 ఎకరాలు, లూనావత్ వెంకన్న 2 ఎకరాలు, భూక్య బిక్షం 3 ఎకరాల మేర మొక్కజొన్న కుప్పలు దగ్ధమయ్యాయి. మంటలను అదుపు చేసేందుకు రైతులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. చేతికి వచ్చిన పంట కాలిపోవడంతో భారీ నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని కోరారు.

# జనులారా.. జర జాగ్రత్త

- 'సూపర్ ఎల్‌నినో'తో తీవ్ర ఎండల ప్రభావం
- డాక్టర్ గ్రీష్మ ఒగ్గు పలు సూచనలు

**వేద న్యూస్, జమ్మికుంట:**



ప్రస్తుత మే నెలలోనే రోకళ్లు పగిలేలా ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. ఈ క్రమంలోనే 'సూపర్ ఎల్‌నినో' పదం.. ప్రస్తుతం అంతటా చర్చనీయాంశంగా ఉన్నది. ఇంతకీ దీని అర్థం ఏమిటి? ప్రస్తుత వేసవి కాలంలో ప్రతీ ఒక్కరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రముఖ వైద్యురాలు, కన్సల్టెంట్ అబ్‌స్టెటిషియన్, గైనకాలజిస్ట్, సర్టిఫైడ్ మోనోపాజ్ ప్రాక్టీషనర్, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ గ్రీష్మ ఒగ్గు వివరించారు. పసిఫిక్ మహాసముద్రంలో తీవ్రమైన వేడి ఏర్పడటాన్ని 'ఎల్‌నినో' అంటారని, 'సూపర్' అనగా మరింత ఎక్కువగా వచ్చే సందర్భమని, దీని వల్ల అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు సంభవిస్తాయని డాక్టర్ గ్రీష్మ వెల్లడించారు. ప్రతీ ఒక్కరూ ప్రస్తుత ఎండాకాలం సీజన్‌లో క్రమం తప్పకుండా తాగునీటిని తాగాలని చెప్పారు. బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా వాటర్ బాటిల్ తీసుకెళ్లాలని సూచించారు. 11 నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లకుండా ఉండటం ఉత్తమమని చెప్పారు. ఒకవేళ తప్పనిసరై వెళ్లాల్సి వస్తే .. జాగ్రత్తలు పాటించాలని, లూజ్, కాటన్ దుస్తులు ధరించాలని, కూల్ డ్రింక్స్ తీసుకోకూడదని వెల్లడించారు. బటర్ మిల్క్ , సహజంగా లభించే పానీయాలు (నిమ్మరసం తదితరాలు) తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుత వేసవికాలంలో దూర ప్రయాణాలు మానుకోవడం మంచిదని, అత్యవసరమైతే తగు జాగ్రత్తలతో జర్నీకి ఏర్పాట్లు చేసుకోవాలని,ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. వేసవి కాలాన్ని లెక్క చేయకుండా బయట తిరిగితే 'హీట్ స్ట్రోక్' వల్ల ప్రాణాలు పొంచిన ప్రమాదాన్ని గుర్తించాలని, హెల్త్ పట్ల ఫోకస్ చేయాలన్నారు.

# ‘ఉపాధి హామీ’ సద్వినియోగం చేసుకోవాలి

- జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ పనులకు హాజరు కావాలి
- పొన్నారం సర్పంచ్ పెంచాల మధు



**వేద న్యూస్, మందమర్రి:**

గ్రామాల్లో వలసలు నివారించి స్థానికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి జాబ్ కార్డు కలిగిన వ్యక్తి సద్వినియోగం చేసుకోవాలని పొన్నారం సర్పంచ్ పెంచాల మధు కోరారు. గురువారం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సంవత్సరంలో నిర్దిష్ట పని దినాలు పూర్తి చేయాల్సి ఉంటుందని, లేకపోతే జాబ్ కార్డు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. ఒకసారి రద్దైన జాబ్ కార్డు తిరిగి పొందడం కష్టమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు కూడా తప్పనిసరిగా ఉపాధి హామీ పనుల్లో పాల్గొనాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన కోసం అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య, గ్రామస్తులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానాలు

- న్యూసెన్స్ సృష్టించిన వారిపై పోలీసుల చర్యలు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై హెచ్చరిక

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తులతో పాటు రోడ్లపై న్యూసెన్స్ చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు పరకాల రెండో అదనపు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి శ్రీవల్లి శైలజ జరిమానాలు విధించినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. పరకాల గ్రామానికి చెందిన పిట్టల యుగేందర్, కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన ఆలేటి ప్రవీణ్, మధ్యప్రదేశ్‌కు చెందిన లోది పుష్పేందర్, హైదరాబాద్‌కు చెందిన బోండా శ్రీను లకు కలిపి రూ.4,600 జరిమానా విధించారు. అలాగే అర్ధరాత్రి రోడ్లపై మద్యం సేవిస్తూ న్యూసెన్స్ చేసిన శాయంపేట గ్రామానికి చెందిన మారపల్లి రఘువర్మకు రూ.1,000 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై జక్కుల పరమేష్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, ఇది వ్యక్తిగత ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# సీజ్ చేసిన వాహనాలను యజమానులు తీసుకెళ్లాలి

- సరైన పత్రాలు చూపించి ఆరు నెలల్లో స్వాధీనం చేసుకోవాలి
- లేకపోతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం
- ఎస్పీ మహేష్ బి. గితే



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో వివిధ సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న, రోడ్లపై వదిలివేయబడిన 15 ద్విచక్ర వాహనాలను జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాల యజమానులు ఈ రోజు నుంచి ఆరు నెలల లోపు సంబంధిత ధృవపత్రాలు చూపించి వాహనాలను తిరిగి తీసుకెళ్లవచ్చని సూచించారు. యజమానులు అందుబాటులో లేని పక్షంలో కుటుంబ సభ్యులు కూడా సరైన పత్రాలు సమర్పించి వాహనాలను స్వాధీనం చేసుకోవచ్చన్నారు. నిర్దిష్ట గడువులోగా ఎవరూ వాహనాలను తీసుకుపోని పక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటిని వేలం వేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. వాహన యజమానులు జిల్లా పోలీస్ కార్యాలయంలోని మోటార్ వెహికల్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 87126 56428, 90009 10619 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# మాట్ల రమేష్‌కు సత్కారం

- జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా అభినందనలు
- పుల్ల ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన కమలాపూర్ మాజీ ఎంపీపీ మాట్ల రమేష్‌కు పుల్ల ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు. కమలాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుల్ల ఫ్యామిలీస్ సభ్యులు మాట్లాడుతూ.. మాట్ల రమేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి రాజకీయంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్ల శ్రీనివాస్, పుల్ల కొమురయ్య, మాజీ సర్పంచ్ శనిగరపు సమ్మయ్య, వార్డు సభ్యుడు ఐలయ్య, పుల్ల వినోద్, పుల్ల శోభన్, మాట్ల సాగర్, బిక్షపతి, కళ్యాణ్, సమ్మయ్య, పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ‘కాలు మీద కాలు’!

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యక్రమంలో ఘటన
- కలెక్టర్ గరిమా అగర్వాల్ తీరుపై విమర్శలు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు
- ప్రొటోకాల్ పాటించలేదంటూ రాజకీయ వర్గాల ఆగ్రహం
- ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం అవసరమన్న అభిప్రాయాలు



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్న అధికారిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ కూర్చున్న తీరు వివాదాస్పదంగా మారింది. సభ జరుగుతున్న సమయంలో కలెక్టర్ కాలు మీద కాలు వేసుకుని కూర్చోవడం ఇప్పుడు రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన సభలో మంత్రి ప్రసంగిస్తున్న సమయంలోనూ కలెక్టర్ అదే విధంగా కూర్చోవడం సభామర్యాదలకు విరుద్ధమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కీలక అధికారిక వేదికలపై అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ఆనవాయితీ కాగా, ఈ ఘటన ఆ సంప్రదాయాన్ని విస్మరించినట్లుగా ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జిల్లాకు అత్యున్నత అధికారిగా ఉన్న కలెక్టర్, కేంద్ర మంత్రితో వేదిక పంచుకుంటున్న సమయంలో ప్రొటోకాల్ పాటించలేదని రాజకీయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు కూడా స్పందిస్తున్నారు. ‘ఇది ప్రజా వేదిక.. అధికారుల ప్రవర్తనలో మర్యాద అవసరం’ అంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య పరస్పర గౌరవం అవసరమని, బహిరంగ వేదికలపై ప్రవర్తనా నియమావళిని పాటించడం ఎంతో ముఖ్యమని పలువురు సూచిస్తున్నారు.

# అన్‌లోడింగ్ త్వరగా పూర్తి చేయాలి

- రైస్ మిల్లుల్లో హమాలీల సంఖ్య పెంచాలి
- కొనుగోలు కేంద్రాలు, మిల్లులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంటనే అన్‌లోడింగ్ చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారం గ్రామాల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి ధాన్యం రాశులు, కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసిన అదనపు కలెక్టర్, రైస్ మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచి లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం చింతలకుంటపల్లిలోని లక్ష్మీ సాయి రైస్ మిల్లు, తాళ్లపల్లిలోని రాజరాజేశ్వర



రైస్ ఇండస్ట్రీస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి అన్‌లోడింగ్, హమాలీల సంఖ్య పెంపు తదితర అంశాలపై మిల్లర్లకు సూచనలు చేశారు.

# సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

- పూర్తిగా కాలిపోయిన ఇల్లు.. రూ.15 లక్షల ఆస్తి నష్టం
- ఫైర్ సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు
- ప్రభుత్వ సహాయం అందిస్తామని హామీ
- నిత్యావసర సరుకులు, నగదు అందజేసిన అధికారులు
- దైవ దర్శనానికి వెళ్లిన కుటుంబంలో విషాదం





**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి మండలం చిర్రకుంట గ్రామంలో గురువారం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు కన్నెపల్లి మండలం ఎల్లారం పోచమ్మ ఆలయానికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి చెందిన సంద్ర వెంకటస్వామి కుటుంబ సమేతంగా దైవ దర్శనానికి వెళ్లిన కొద్దిసేపటికే ఇంటి నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులకు, బెల్లంపల్లి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అప్పటికే మంటలు వేగంగా వ్యాపించి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఇంటి పక్కనున్న మరో ఇంటికి కూడా మంటలు వ్యాపించగా గ్రామస్తులు నీళ్లు చల్లి అదుపు చేసే ప్రయత్నం చేశారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ అగ్నిప్రమాదంలో టీవీ, ఫ్రిజ్, ఎలక్ట్రికల్ వస్తువులు, బంగారం, వెండి ఆభరణాలు, నగదు పూర్తిగా కాలిపోయాయని బాధితులు తెలిపారు. సుమారు రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని ఎంపీడీఓ రాజేశ్వర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాథోడ్ గణపతి సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందే రాంచందర్, కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంఆర్ఐ గణపతి బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

వేద న్యూస్

శుక్రవారం మే 08, 2026

# సేవే 'విజేత' మార్గం

- సదరు ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో చక్కటి వైద్యం..
- 24/7 అందుబాటులో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంధం రవి వర్మ






**వేద న్యూస్, హుజూరాబాద్:**

హుజూరాబాద్ పట్టణ, నియోజకవర్గ, పరిసర ప్రాంతంలో మెరుగైన సేవలు అందించే లక్ష్యంతోనే పట్టణంలోని విజేత పిల్లల ఆస్పత్రి ముందుకు సాగుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చులో మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ.. తొలి ఏడాది పూర్తి చేసుకున్న హాస్పిటల్.. నిత్యం చక్కటి సేవలందిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**పిల్లల ఆరోగ్య సం'రక్షణే' కర్తవ్యం**

విజేత పిల్లల ఆస్పత్రిలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గంధం రవి వర్మ.. పిల్లల ఆరోగ్య సం'రక్షణే' కర్తవ్యంగా వైద్య సేవలు అందిస్తున్నారు.నవజాత శిశువుల ఆరోగ్యానికి సంబంధించి ట్రీట్‌మెంట్ విషయమై ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ ఎక్విప్‌మెంట్స్ అందుబాటులో ఉండటం విశేషం. ఎన్‌ఐసీయూ(నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో అధునాతన సీపాప్ మెషీన్‌తో పాటు అన్ని రకాల ఫెసిలిటీస్ అందుబాటులో ఉన్నాయి. తక్కువ ఖర్చులో కార్పొరేట్ స్థాయి అందిస్తూ.. విజేత పిల్లల ఆస్పత్రి అనతికాలంలోనే ప్రజల మన్ననలను పొందుతున్నది. చక్కటి సేవలందిస్తున్న విజేత ఆస్పత్రిలో వైద్య సేవల కోసం ప్రజలు సంప్రదించొచ్చని, సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన అవసరమే లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సదరు ఆస్పత్రిలో మెరుగైన, చక్కటి కార్పొరేట్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలువురు చెబుతున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని, పరిసర ప్రాంత ప్రజలు సదరు హాస్పిటల్‌లో 24/7అవేలబుల్‌గా ఉంటున్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంధం రవి వర్మ ఎంబీబీఎస్ (గాంధీ ఆస్పత్రి హైదరాబాద్), ఎండీ పీడియాట్రిక్స్(ఎంజీఐఎంఎస్ సేవాగ్రామ్) సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి నిర్వాహకులు కోరుతున్నారు.

# మానేరువాగులో ఇసుక అక్రమ టెండర్ ఆపాలి

- రైతులతో కలిసి ప్రొక్లైన్లను అడ్డుకున్న సర్పంచ్
- ఇసుక తరలింపుతో బోర్లు ఎండిపోతాయంటూ ఆందోళన



**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూర్ గ్రామ పరిధిలోని మానేరువాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని సర్పంచ్ పట్నం అశ్విని శ్రీనివాస్ ఆరోపించారు. బ్రిడ్జి సమీపం నుంచి ఎల్ఎండి వరకు ఓ కంపెనీకి చెందిన రెండు హిటాచి ప్రొక్లైన్లతో ఇసుక తవ్వకాలు చేపట్టగా, రైతులతో కలిసి వాటిని అడ్డుకుని వెనక్కి పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రైతుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. మానేరువాగులో ఇసుక మొత్తం తరలిస్తే భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, రైతుల బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే స్థానిక అవసరాలకు మించి ఇతర మండలాలకు కూడా ఇసుక అనుమతులు ఇవ్వడం వల్ల గ్రామానికి నష్టం జరుగుతోందని తెలిపారు. ఇతర మండలాలకు వారి పరిధిలోనే ఇసుక అనుమతులు ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరారు.

# పాడి కౌశిక్ రెడ్డిపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి

- బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి..
- మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు



**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల కార్యాలయాలపై దాడులు జరగడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో మాటకు మాటతో సమాధానం చెప్పాలే గానీ, దాడులు చేసి విధ్వంసానికి పాల్పడటం బీజేపీ అసలు స్వభావాన్ని బయటపెడుతోందని విమర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడి వ్యక్తిగత దాడి మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. ఈ ఘటనలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం బాధాకరమని, దాడికి పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

# నిర్మాణంలోనే ఒరిగిపోయిన డ్రైనేజీ గోడ

- చొప్పదండిలో నాసిరకం పనులపై స్థానికుల ఆగ్రహం
- ప్రజాధనం దుర్వినియోగమంటూ విమర్శలు
- వర్షాకాలంలో కూలిపోతుందనే భయాందోళనలు



**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి పట్టణంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు వెలుగుచూస్తున్నాయి. నిర్మాణం పూర్తికాకముందే డ్రైనేజీ గోడ ఒకవైపుకు ఒరిగిపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పునాది సరిగా వేయకపోవడం, కాంక్రీట్ నాణ్యత లోపించడం, సరైన క్యూరింగ్ చేయకపోవడం వల్లే గోడ వంగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఈ గోడ కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణంలో ఎక్కడికక్కడ అసమానంగా గోడలు నిర్మించడం, కొన్ని చోట్ల ఇనుప రాడ్లు బయటపడటం, స్లాబ్‌లు బలహీనంగా ఉండటం వంటి అంశాలపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హైటెన్షన్ విద్యుత్ స్తంభాల పక్కనే భద్రతా ప్రమాణాలు పాటించకుండా తవ్వకాలు చేపట్టడం ప్రమాదకరమని అంటున్నారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంతో రోడ్లపై మట్టి గుట్టలు పేరుకుపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు నిలిచి దుర్వాసన, దోమల సమస్య పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. ఒరిగిపోయిన గోడను వెంటనే తొలగించి నిబంధనల ప్రకారం నాణ్యతతో మళ్లీ నిర్మించాలని, సంబంధిత అధికారులు పనులను సాంకేతికంగా పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సర్దాపూర్ కొనుగోలు కేంద్రంలో తనిఖీ



**వేద న్యూస్, సిరిసిల్ల :**

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ మార్కెట్ కమిటీ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులను పరిశీలించిన కలెక్టర్, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచి ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే కొనుగోలు కేంద్రాలా..?



- ఫొటోలకు ఫోజులే తప్ప సమస్యలు పట్టించుకోవడం లేదు
- బీజేపీ దళిత్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

ఇల్లంతకుంట మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు పేరుకే ప్రారంభించారని, ఇప్పటికీ పూర్తి స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కాలేదని బీజేపీ దళిత్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి హరీష్ విమర్శించారు. మండలంలోని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 నుంచి 20 రోజులు గడిచినా రైతుల వడ్లకు తూకం వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప ఉపయోగపడే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలుగా ఉన్న వడ్లు అకాల వర్షాలకు తడిసి రైతులు భారీ నష్టాలు చవిచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల తరపున బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# 42 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



**వేద న్యూస్, రుద్రూర్:**

రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. రుద్రూర్ మండలంలోని జేయన్సీ కాలనీలో షరీఫ్ ఉద్దీన్ ఇంట్లో పిడీఎస్ బియ్యం నిల్వ ఉంచారని పక్కా సమాచారం మేరకు పోలీసులు ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. 42 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీన పర్చుకుని షరీఫ్ ఉద్దీన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయన్న వెల్లడించారు.

# డీసీఎంను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు..

**వేద న్యూస్ సూర్యాపేట :**




ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డీసీఎంను ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దోరకుంట వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లున్న గౌతమ్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు దోరకుంట వద్ద డీసీఎంను వెనుక నుంచి ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో ట్రావెల్ బస్సు డ్రైవర్‌కు గయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వేద న్యూస్

శుక్రవారం మే 08, 2026

# రెడ్ క్రాస్ ప్రత్యేక సభ్యత్వ నమోదు

**– హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్**




**వేద న్యూస్, హనుమకొండ :**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయ్ ప్రారంభించారు. అనంతరం రెడ్ క్రాస్ పరిపాలన భవనంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజ సేవలో భాగస్వామ్యం కావాలనుకునే వారు రెడ్ క్రాస్ సభ్యత్వం పొందవచ్చని తెలిపారు. సభ్యత్వం కోసం దరఖాస్తు ఫారం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ ప్రతితో పాటు రూ. 1,150 శాశ్వత సభ్యత్వ రుసుము చెల్లించాలని సూచించారు. అనంతరం పాలకవర్గ సమావేశంలో రెడ్ క్రాస్ ఆదాయం, వ్యయాలను సమీక్షించారు. రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సేవలను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# యువతరం భద్రత..సామాన్య ప్రజల ప్రాణరక్షణే కర్తవ్యం

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**




వరంగల్ నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోచమ్మమైదాన్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఏసీపీ సత్య నారాయణ,వరంగల్ ట్రాఫిక్ విభాగం సర్కిల్ ఇన్స్పెక్టర్ కోడూరి సుజాత ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని పట్టుకునేందుకు డ్రంకెన్ డ్రైవ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టంగా నిర్వహించారు. అదే సమయంలో వారి సిబ్బంది పోస్టాఫీస్ జంక్షన్ తో పాటు పలు ముఖ్యమైన కూడళ్లలో విస్తృతంగా అడుగడుగునా తనిఖీలు జరిపాయి. ముఖ్యంగా ప్రాణాలకు ముప్పు తెచ్చే మైనర్ డ్రైవింగ్ కు పాల్పడుతున్న యువతను, కనీస బాధ్యత లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డెక్కిన వాహనదారులను గుర్తించి భారీగా జరిమానాలు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ఏమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారి పట్ల ఎంత కఠినంగా ఉంటామో స్పష్టం చేస్తూ, యువతరం భద్రతతో పాటు సామాన్య ప్రజల ప్రాణరక్షణే తమ ప్రథమ కర్తవ్యమని వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత అన్నారు .

# ఐపీఎల్‌లో భువీ అరుదైన ఘనత

**వేద న్యూస్ డెస్క్:**




టీమిండియా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ చరిత్రలో అరుదైన రికార్డుకు చేరువయ్యాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగే మ్యాచ్ ద్వారా భువీ తన ఐపీఎల్ కెరీర్‌లో 200వ మ్యాచ్ ఆడబోతున్నాడు. ఈ ఘనత సాధించిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా నిలవనున్నాడు. భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ ప్రయాణం 2010లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ప్రారంభమైంది. అయితే ఆ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాకపోవడంతో ఆర్‌సీబీ అతడిని విడుదల చేసింది. అనంతరం పూణే వారియర్స్ జట్టులో తన ప్రతిభను చాటుకున్న భువీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున స్టార్ బౌలర్‌గా ఎదిగాడు. 2025 వేలంలో ఆర్‌సీబీ మళ్లీ భారీ మొత్తానికి అతడిని సొంతం చేసుకుంది. ప్రస్తుతం భువీ 199 మ్యాచ్‌ల్లో 215 వికెట్లు సాధించాడు. ఐపీఎల్‌లో 200 వికెట్లు తీసిన తొలి ఫాస్ట్ బౌలర్ కూడా అతడే కావడం విశేషం. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్న భువనేశ్వర్ ఇప్పటివరకు 9 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో ముందంజలో ఉన్నాడు. భువీ ఘనతపై ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రశంసలు కురిపించాడు. “ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ బౌలర్లలో భువీ తప్పకుండా ఉంటాడు. ఫాస్ట్ బౌలర్‌గా 200 మ్యాచ్‌లు ఆడటం చిన్న విషయం కాదు. అతడి క్రమశిక్షణ, ఫిట్‌నెస్ అద్భుతం” అని కొనియాడాడు. స్వింగ్ బౌలింగ్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెట్టడంలో దిట్టైన భువనేశ్వర్, డెత్ ఓవర్లలో యార్కర్లతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. రెండు సార్లు పర్పుల్ క్యాప్ గెలిచిన భువీ, ఈసారి కూడా అదే జోరును కొనసాగిస్తూ మరోసారి అత్యధిక వికెట్లు సాధించే బౌలర్‌గా నిలవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఐపీఎల్‌కు ఆసీస్ బోర్డు గ్రీన్ సిగ్నల్









**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు గుడ్‌న్యూస్ చెప్పింది. పాకిస్థాన్‌తో జరగనున్న వన్డే సిరీస్ కంటే ఐపీఎల్ బాధ్యతలకే ప్రాధాన్యం ఇవ్వాలని తమ ఆటగాళ్లకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో పలువురు ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్లు ఐపీఎల్ ముగిసే వరకు భారత్‌లోనే ఉండనున్నారు. మే 30 నుంచి పాకిస్థాన్‌తో ఆస్ట్రేలియా మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. షెడ్యూల్ ప్రకారం కంగారూ జట్టు మే 22న ఇస్లామాబాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు కొనసాగనుండటంతో ప్లే ఆఫ్స్, ఫైనల్‌లో పాల్గొనే ఆటగాళ్లకు మినహాయింపు ఇచ్చినట్లు సమాచారం. దీంతో వన్డే కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సహా దాదాపు పన్నెండుమంది ఆటగాళ్లు పాకిస్థాన్ పర్యటనకు దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో ఆటగాళ్లను వెంటనే జాతీయ జట్టులో చేరాలని ఆస్ట్రేలియా బోర్డు ఆదేశిస్తుంది. కానీ ఈసారి మాత్రం ఐపీఎల్ పూర్తయ్యాకే రావచ్చని చెప్పడం విశేషంగా మారింది. ఐపీఎల్ కోసం పాకిస్థాన్ సిరీస్‌కు దూరమయ్యే అవకాశమున్న ఆటగాళ్లలో ప్యాట్ కమిన్స్, మిచెల్ మార్ష్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, బార్ట్‌లెట్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, కామెరూన్ గ్రీన్, మార్కస్ స్టోయినిస్, కూపర్ కొన్నొల్లీ వంటి స్టార్ ఆటగాళ్లు ఉన్నారు. ప్రస్తుతం కమిన్స్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, ట్రావిస్ హెడ్ కూడా అదే జట్టుకు ఆడుతున్నాడు. హేజిల్‌వుడ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, మిచెల్ స్టార్క్ ఢిల్లీ జట్టులో ఉన్నాడు. మార్ష్, ఇంగ్లిస్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్నారు. స్టోయినిస్, బార్ట్‌లెట్, కొన్నొల్లీ పంజాబ్ కింగ్స్ జట్టులో భాగంగా ఉన్నారు. ఆస్ట్రేలియా బోర్డు నిర్ణయంతో ప్లే ఆఫ్స్‌కు చేరే జట్లకు ఇది పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది. స్టార్ ఆటగాళ్లు పూర్తి సీజన్ అందుబాటులో ఉండటంతో ఐపీఎల్ పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల

**వేద న్యూస్ డెస్క్:**




భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2027 షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించింది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా జట్టు భారత్‌లో పర్యటించనుంది. సిరీస్‌లో తొలి టెస్టు 2027 జనవరి 21న నాగ్‌పూర్ వేదికగా ప్రారంభం కానుంది. రెండో టెస్టు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు చెన్నైలో జరుగుతుంది. మూడో టెస్టు ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు గువహటిలో నిర్వహించనున్నారు. నాలుగో టెస్టు ఫిబ్రవరి 19 నుంచి రాంచీలో జరగనుండగా, చివరి టెస్టు ఫిబ్రవరి 27 నుంచి అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు. ఇటీవల భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లు ప్రపంచవ్యాప్తంగా భారీ ఆసక్తిని రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో 2027 సిరీస్‌పైనా ఇప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో భారత పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా-ఏ జట్టు కూడా భారత్-ఏ జట్టుతో బహుళ ఫార్మాట్ సిరీస్ ఆడనుంది. సెప్టెంబర్ 22 నుంచి పుదుచ్చేరిలో తొలి నాలుగు రోజుల మ్యాచ్ ప్రారంభం కానుంది. అనంతరం మరో ఫోర్‌డే మ్యాచ్‌తో పాటు మూడు వన్డేలు కూడా జరుగనున్నాయి. మరోవైపు భారత అండర్-19 జట్టు కూడా స్వదేశంలో ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో సిరీస్ ఆడనుంది. రాజ్‌కోట్, అహ్మదాబాద్ వేదికలుగా మూడు వన్డేలు, రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్ ఇలా ఉంది: జనవరి 21 తొలి టెస్టు నాగ్‌పూర్ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 రెండో టెస్టు చెన్నై ఫిబ్రవరి 11 నుంచి 15 మూడో టెస్టు గువహటి ఫిబ్రవరి 19 నుంచి 23 నాలుగో టెస్టు రాంచీ ఫిబ్రవరి 27 నుంచి ఐదో టెస్టు అహ్మదాబాద్

# సూర్యకుమార్ యాదవ్ ఇంట్లో ఆనందాల వెల్లువ.. తండ్రైన టీమిండియా కెప్టెన్




**వేద న్యూస్ డెస్క్:**

భారత టీ20 జట్టు కెప్టెన్, స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ జీవితంలో మరపురాని క్షణం ఆవిష్కృతమైంది. తన దూకుడైన బ్యాటింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న సూర్య, ఇప్పుడు వ్యక్తిగత జీవితంలో కూడా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించాడు. అతడి భార్య దేవిశ శెట్టి గురువారం పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో సూర్యకుమార్ యాదవ్ తొలిసారి తండ్రిగా ప్రమోట్ అయ్యాడు. ఈ శుభవార్తను స్వయంగా సూర్యకుమార్ యాదవ్ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. చిన్నారి చేతిని పట్టుకున్న ఫొటోను పోస్టు చేస్తూ భావోద్వేగ సందేశాన్ని రాశాడు. “ముసిముసి నవ్వులు, కలలు నిజమైన వేళ.. మా జీవితాల్లోకి చిన్నారి ఏంజెల్ వచ్చింది. మేము ఇప్పుడు తల్లిదండ్రులమయ్యాం” అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఈ పోస్ట్ నిమిషాల వ్యవధిలోనే వైరల్‌గా మారింది. సూర్య పోస్టును చూసిన అభిమానులు, క్రికెటర్లు, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. “మిస్టర్ 360 జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభమైంది”, “స్కై ఇప్పుడు సూపర్ డ్యాడ్ అయ్యాడు” అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. సూర్యకుమార్ యాదవ్, దేవిశ శెట్టి ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 2016లో వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. పెళ్లైన దాదాపు పదేళ్ల తర్వాత ఈ జంట తల్లిదండ్రులు కావడంతో వారి కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గత కొన్ని రోజులుగా దేవిశ బేబీ బంప్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు ఈ జంటకు ముందుగానే శుభాకాంక్షలు తెలియజేశారు. భారత జట్టులో అత్యంత వినూత్న షాట్లు ఆడే బ్యాటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న సూర్యకుమార్ యాదవ్, టీ20 క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. మైదానంలో ఒత్తిడి పరిస్థితుల్లో కూడా భిన్నమైన షాట్లతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చగల ఆటగాడిగా పేరు తెచ్చుకున్నాడు. అందుకే అభిమానులు అతడిని “మిస్టర్ 360” అని పిలుస్తుంటారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున సూర్యకుమార్ కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. గత కొన్ని సీజన్లుగా అతడి ప్రదర్శన జట్టుకు ప్రధాన బలంగా మారింది. భారత జట్టుకు కూడా ఎన్నో కీలక విజయాలు అందించిన సూర్య, ఇప్పుడు కుటుంబ జీవితంలో కొత్త బాధ్యతలను స్వీకరించాడు. ప్రస్తుతం అభిమానులు, సహచర ఆటగాళ్లు, ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ అందరూ ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. “చిన్నారి రాకతో సూర్య జీవితంలో ఆనందాల వెలుగు మరింత పెరిగింది” అంటూ సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.చిన్నారి చేతిని పట్టుకున్న ఫొటోను పోస్టు చేస్తూ భావోద్వేగ సందేశాన్ని రాశాడు. “ముసిముసి నవ్వులు, కలలు నిజమైన వేళ.. మా జీవితాల్లోకి చిన్నారి ఏంజెల్ వచ్చింది. మేము ఇప్పుడు తల్లిదండ్రులమయ్యాం” అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఈ పోస్ట్ నిమిషాల వ్యవధిలోనే వైరల్‌గా మారింది. సూర్య పోస్టును చూసిన అభిమానులు, క్రికెటర్లు, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. “మిస్టర్ 360 జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభమైంది”, “స్కై ఇప్పుడు సూపర్ డ్యాడ్ అయ్యాడు” అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. సూర్యకుమార్ యాదవ్, దేవిశ శెట్టి ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 2016లో వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. పెళ్లైన దాదాపు పదేళ్ల తర్వాత ఈ జంట తల్లిదండ్రులు కావడంతో వారి కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

వేద న్యూస్

శుక్రవారం మే 08, 2026

# కార్తీ కొత్త చిత్రానికి శ్రీకారం



**వేద న్యూస్ డెస్క్:**

తమిళ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యువ దర్శకుడు కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందనున్న కొత్త చిత్రం నేడు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఇప్పటికే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొనగా, తాజా ముహూర్త కార్యక్రమంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో అధికారికంగా పట్టాలెక్కింది. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్.. ఈసారి కార్తీతో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమాలో కార్తీ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించనుంది. నేడు జరిగిన ముహూర్త కార్యక్రమానికి చిత్రబృంద సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరైనట్లు సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. తెలుగులో కార్తీకి ఉన్న ప్రత్యేక అభిమాన వర్గం, దర్శకుడు కళ్యాణ్ శంకర్ హాస్య శైలి కలవడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. వినోదం, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుగా ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.

# నయన్ లైఫ్‌స్టైల్ ఖర్చుపై విఘ్నేష్ వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణాది సినీ పరిశ్రమలో 'లేడీ సూపర్ స్టార్'గా గుర్తింపు పొందిన నయనతార విలాసవంతమైన జీవనశైలి గురించి ఎప్పుడూ చర్చలు జరుగుతూనే ఉంటాయి. తాజాగా ఆమె భర్త, దర్శకుడు విఘ్నేష్ శివన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నయనతార సౌకర్యవంతమైన జీవితం గడపాలంటే రోజుకు ఎంత ఖర్చవుతుందనే అంశంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నయనతార ప్రస్తుతం దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ అగ్ర నటిగా కొనసాగుతున్నారు. 'జవాన్' సినిమాతో వెయ్యి కోట్ల క్లబ్‌లో చోటు సంపాదించిన ఆమెకు దేశవ్యాప్తంగా భారీ అభిమాన వర్గం ఉంది. సినిమాలతో పాటు నిర్మాణ సంస్థలు, చర్మ సంరక్షణ ఉత్పత్తులు, ఇతర వ్యాపారాల ద్వారా కూడా భారీ ఆదాయం పొందుతున్నారు. చెన్నై, ముంబై, హైదరాబాద్, కేరళ వంటి ప్రాంతాల్లో నయనతారకు విలాసవంతమైన గృహాలు ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా ప్రైవేట్ జెట్ సహా పలు ఖరీదైన ఆస్తులు కూడా ఆమె సొంతమని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో విఘ్నేష్ శివన్ మాట్లాడుతూ.. "రూ.350 కోట్లను ఫిక్స్డ్ డిపాజిట్‌గా పెట్టగలిగితే మా కుటుంబం ఎంతో సంతోషంగా జీవించగలదు" అని అన్నారు. ఆ మొత్తం ద్వారా సంవత్సరానికి సుమారు రూ.21 నుంచి రూ.24 కోట్ల వరకు వడ్డీ వస్తుందని, దాన్ని నెలవారీగా లెక్కిస్తే దాదాపు రూ.2 కోట్ల వరకు వస్తుందని తెలిపారు. రోజుకు సుమారు రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు ఆదాయం ఉంటే కుటుంబ అవసరాలు సౌకర్యంగా నెరవేరుతాయని పేర్కొన్నారు. ఇప్పుడంతా తాను సంపాదన పెంపుపైనే దృష్టి పెట్టినట్లు విఘ్నేష్ వెల్లడించారు. ఖాళీ సమయం దొరికినప్పుడల్లా వ్యాపారవేత్తలతో మాట్లాడి వ్యాపార సలహాలు తీసుకుంటానని చెప్పారు. అయితే రూ.350 కోట్ల లక్ష్యానికి ఎంత దగ్గరలో ఉన్నారనే ప్రశ్నకు మాత్రం చిరునవ్వుతో సమాధానం దాటవేశారు. సోషల్ మీడియాలో మాత్రం నయనతార జీవనశైలిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వ్యక్తిగత మేకప్ సిబ్బంది, స్టైలిస్టులు,



భద్రతా సిబ్బంది, ఫోటోషూట్లు, ప్రయాణాలు, విలాసవంతమైన నిర్వహణ ఖర్చులు కలిపితే రోజువారీ ఖర్చులు భారీగానే ఉంటాయని నెటిజన్లు అంచనా వేస్తున్నారు. అయితే డబ్బు కంటే వ్యక్తిగత గోప్యత, సౌకర్యాలకు నయనతార ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. విఘ్నేష్ వ్యాఖ్యలపై నయనతార మాత్రం ఇప్పటివరకు ఎలాంటి స్పందన ఇవ్వలేదు.


# 'మా ఇంటి బంగారం' విడుదల వాయిదా

**వేద న్యూస్ డెస్క్:**

ప్రముఖ నటి సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమా విడుదల వాయిదా పడినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చాలా కాలం తర్వాత సమంత పూర్తి స్థాయి శక్తివంతమైన పాత్రలో కనిపించనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన ప్రచార దృశ్యాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. దర్శకురాలు నందిని రెడ్డి ఈ చిత్రాన్ని కుటుంబ భావోద్వేగాలు, ఉత్కంఠభరితమైన పోరాట సన్నివేశాల మేళవింపుతో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను సమంత తన సొంత నిర్మాణ సంస్థపై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సాధారణ గృహిణిలా కనిపించే మహిళ అవసరమైన సమయంలో ధైర్యంగా ఎదురుదాడి చేసే పాత్రలో సమంత కనిపించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రచార దృశ్యాల్లో చూపించిన పోరాట సన్నివేశాలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. మొదట ఈ చిత్రాన్ని మే 15న విడుదల చేయాలని చిత్రబృందం భావించింది. అయితే ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐపీఎల్ 2026 సందడి కొనసాగుతుండటంతో సినిమా ప్రదర్శనలపై ప్రభావం పడే అవకాశం ఉందని నిర్మాతలు అంచనా వేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిత్ర విడుదలను జూన్ 19కు మార్చినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. భావోద్వేగాలు, కుటుంబ కథనం, ఉత్కంఠభరిత సన్నివేశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాతో సమంత మరోసారి తన నటనలో కొత్త కోణాన్ని చూపించబోతున్నారని అభిమానులు భావిస్తున్నారు. విడుదల వాయిదా పడటం కొంత నిరాశ కలిగించినప్పటికీ, సరైన సమయంలో విడుదలైతే సినిమాకు మరింత మంచి ఆదరణ లభించే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# 'స్పిరిట్'పై స్పష్టత ఇచ్చిన చిత్రబృందం




**వేద న్యూస్ డెస్క్:**

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'స్పిరిట్' వాయిదా పడిందంటూ గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై చిత్రబృందం స్పందించింది. సినిమా విడుదల ఆలస్య మవుతోందని, చిత్రీకరణ అనుకున్న వేగంతో సాగడం లేదని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మేకర్స్ స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ ముందుగా రూపొందించిన ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని వెల్లడించారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయిలో రూపుదిద్దుకుంటోంది. యాక్షన్, భావోద్వేగాలు, విభిన్నమైన కథనంతో ఈ సినిమాను దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న అనవసర ప్రచారాలను అభిమానులు నమ్మవద్దని చిత్రబృందం కోరింది. సినిమా గురించి కీలక సమాచారం ఉంటే అధికారికంగానే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. ఈ చిత్రంలో ప్రభాస్ శక్తివంతమైన పోలీసు అధికారిగా కనిపించనున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సందీప్ రెడ్డి వంగా శైలిలో తీవ్ర భావోద్వేగాలు, ఉత్కంఠభరిత యాక్షన్ సన్నివేశాలతో కథ సాగనున్నట్లు సమాచారం. హీరోయిన్‌గా త్రిప్తి డిమ్రీ నటిస్తుండగా, వీరిద్దరి మధ్య సాగే భావోద్వేగ కథనం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. సినిమా కథలో మార్పులు, చేర్పులు చేస్తున్నందువల్లే ఆలస్యం జరుగుతోందన్న వార్తలపైనా సినీ వర్గాలు స్పందిస్తున్నాయి. భారీ చిత్రాల్లో నిర్మాణానికి ముందు కథలో మార్పులు చేయడం సాధారణ విషయమేనని, కొన్ని సన్నివేశాలను మరింత బలంగా తీర్చిదిద్దేందుకు దర్శకులు నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొంటున్నారు. అలాంటి అంశాలను వాయిదా ప్రచారంగా మార్చడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఒకేసారి పలు భారీ చిత్రాల్లో నటిస్తున్నారు. 'స్పిరిట్'తో పాటు 'ఫౌజీ', 'కల్కి 2898 ఏడీ' రెండో భాగం చిత్రీకరణల్లో కూడా పాల్గొంటున్నట్లు సమాచారం. అయితే వీటిలో ఎక్కువ ప్రాధాన్యాన్ని మాత్రం 'స్పిరిట్'కే ఇస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ సినిమా అనుకున్న సమయానికే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు.

# 'అగ్లీ స్టోరీ' కోసం తీవ్రంగా శ్రమించిన నందు

**వేద న్యూస్ డెస్క్:**



నందు, అవికా గోర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న రొమాంటిక్ థ్రిల్లర్ 'అగ్లీ స్టోరీ' విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రణవ స్వరూప్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రవితేజ మహాదాస్యం, శివాజీ రాజా, ప్రజ్ఞా నయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మే 22న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'భీమ్లా నాయక్' దర్శకుడు సాగర్ కె చంద్ర ట్రైలర్‌ను విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హీరో నందు మాట్లాడుతూ సినిమాలో తన పాత్ర కోసం ఎంతగా కష్టపడ్డాడో వెల్లడించారు. ""అగ్లీ స్టోరీ'లో నేను పోషించిన కార్తీక్ పాత్ర నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. బయటకు హీరోలా కనిపించే వ్యక్తి లోపల ప్రతినాయకుడి లక్షణాలతో ఉండే పాత్రలు తెలుగులో చాలా అరుదుగా వస్తాయి. అందుకే ఈ సినిమా నాకు పెద్ద సవాల్‌లా అనిపించింది" అని తెలిపారు. షారుఖ్ ఖాన్ నటించిన 'డర్', 'బాజీగర్', అలాగే ఫాహద్ ఫాజిల్ చేసిన '22 ఫిమేల్ కొట్టాయం' సినిమాల నుంచి తన పాత్రకు ప్రేరణ పొందినట్లు నందు చెప్పారు. "ప్రతి కథలోనూ మంచివాడి కోణం మాత్రమే చూస్తుంటాం. కానీ ఈసారి రావణాసురుడి తరహా మనస్తత్వం ఉన్న వ్యక్తి కథను చూపించాలని అనిపించింది. ఆ ఆలోచనే ఈ సినిమాకు కారణమైంది" అని వివరించారు. సినిమా షూటింగ్ సమయంలో పూర్తిగా పాత్రలో మునిగిపోయానని నందు వెల్లడించారు. "ఒక షెడ్యూల్ సమయంలో రోజుకు వంద నుంచి నూట యాభై వరకు సిగరెట్లు కాల్చాల్సి వచ్చేది. నిజానికి నాకు సిగరెట్లు అంటే అసహ్యం. కానీ పాత్ర కోసం తప్పలేదు. షూటింగ్ ముగించుకుని ఇంటికి వెళ్లాక తీవ్రమైన తలనొప్పి, చిరాకు వచ్చేవి" అని చెప్పారు. ఇంకా మాట్లాడుతూ, దర్శకుడు ప్రణవ్ స్వరూప్ తన భార్య గీతా మాధురికి ప్రత్యేకంగా ఫోన్ చేసి పరిస్థితిని వివరించారని తెలిపారు. "షూటింగ్ జరుగుతున్న రోజులలో నేను ఇంట్లో విలన్‌లా ప్రవర్తించినా అపార్థం చేసుకోవద్దని దర్శకుడు ముందే చెప్పాడు. ఎందుకంటే నేను పూర్తిగా పాత్ర మూడ్‌లోనే ఉండిపోయేవాడిని. ఇంటికి వెళ్లాక కూడా కొన్నిరోజులు ఒంటరిగా గదిలోనే ఉండేవాడిని. పిల్లలతో ఆడుకోవాలన్న భావన కూడా ఉండేది కాదు. ఆ పాత్ర మానసికంగా నాపై చాలా ప్రభావం చూపించింది" అని నందు వెల్లడించారు. విడుదలకు ముందే చిత్రబృందం చేసిన వ్యాఖ్యలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

# 'అగధ' టీజర్‌తో ఆసక్తి పెంచిన ఎంఎస్ రాజు




**వేద న్యూస్ డెస్క్:**

ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరోసారి విభిన్న కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అగధ' ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం అనంతర నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల విడుదలైన 'అగధ' టీజర్ ప్రేక్షకుల్లో సినిమాపై భారీ ఆసక్తిని పెంచుతోంది. టీజర్ ప్రారంభం నుంచే ఒక రహస్యభరిత వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రేక్షకులను కథలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆధ్యాత్మిక అంశాలు, థ్రిల్లింగ్ సన్నివేశాలు, మిస్టరీ ఎలిమెంట్స్ కలిసి టీజర్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. ముఖ్యంగా నేపథ్య సంగీతం, ఛాయాగ్రహణం టీజర్‌కు ప్రధాన బలంగా నిలిచాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073